కర్నూలు | నంద్యాల
వార్త
18 ఏప్రిల్, 2023 మంగళవారం పేజీలు 4


## సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**- సరైన పరిష్కారం లేకపోతే సంజాయిషీ ఇవ్వాలి**
**- అర్జీలు రీ ఓపన్ అయితే షోకాజ్ నోటీసులు జారీ**



**కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** స్పందన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నాణ్యతగా పరిష్కారం చేశారో లేదో అడిట్ చేస్తామని జిల్లా కలెక్టరు డా. గుమ్మళ్ళ సృజన అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన అడిటోరియంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టరుతో పాటు జేసి నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు, విడియోకాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈవారం కూడ సచివాలయం, మండలస్థాయిలో పరిష్కరించాల్సిన చిన్నచిన్న సమస్యలుఇక్కడికి వచ్చాయని కలెక్టరు తెలిపారు. అందులో కూడ రెవిన్యూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయన్నారు. తహాశీల్దార్‌లు స్పందించక పోవడం వల్లే ఇంత దూరం వచ్చారా అని ప్రశ్నించారు. మ్యుటేషన్ సమస్యల పరిష్కారానికి సచివాలయంలోనే ధరఖాస్తుచేసుకోవాలన్న విషయం ప్రజలకు ఎందుకు తెలియదు అని ప్రశ్నించారు. ఈవిషయంపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని జేసీ,జడ్పీ సిఇఓలను కలెక్టరు అదేశించారు. శిక్షణ ఇచ్చిన రెండు వారాల తరువాత ఇక్కడికి ధరఖాస్తులు వచ్చాయంటే మండల టీమ్, సచివాలయ ఉద్యోగులే బాధ్యత అన్నారు. వచ్చిన సమస్యలు ఏవిధంగా పరిష్కరించారో కేస్ బై కేస్ అడిట్ చేస్తామని, ఎండార్స్‌మెంట్ కూడ సరిగా పంపారా లేదా అని చెక్‌చేస్తామని కలెక్టరు తెలిపారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు, అనురాధ, రమ, జిల్లా పరిషత్ సిఇఓ నాసరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## దివ్యంగురాలి విన్నపం.. ఆలకించిన జిల్లా కలెక్టరు

**నంద్యాల విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** విధి వక్రీకరించడంతో దివ్యాంగురాలైన గోడును సచివాలయ అధికారులు, మండల అధికారులు, డివిజన్ అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి వచ్చి తమ గోడును వినిపించుకున్న వైనం స్పందన కార్యక్రమంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ఎం గణపురం గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన సి యశోద నడవడానికి వీలులేని పరిస్థితుల్లో ఉంది. విషయాన్ని గమనించిన జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ దివ్యాంగురాలైన యశోధ దగ్గరకు వచ్చి ఆమె చెప్పిన వివరాలు నమోదు చేసుకొని ఆమె ఇచ్చిన అర్జీని స్వీకరించి అక్కడ ఉన్న ఆర్డీఓను, ఎండిఓలను, విడియోకాన్ఫరెన్స్ ద్వారా సత్వరమే న్యాయం చేయాలని అదేశించారు.ఐదు నెలల క్రితం మూడు చక్రాల మోటార్ బైక్‌కోసం అర్జీ పెట్టుకున్నారు. మొదటి విడతలో, రెండవ విడతలో ఆమెకు రాలేదు. దీంతో దివ్యాంగురాలైన యశోద మూడు చక్రాల మోటార్‌బైక్ ఇప్పించాలని కోరుతూ కలెక్టరుకు అర్జీ ఇచ్చుకుంది. న్యాయం చేస్తామని హామి ఇచ్చారు.



## వైసిపి నాలుగేళ్ల పాలనలో..
# అన్ని వర్గాలకు అన్యాయం..!

- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తి చేస్తాం
- గిట్టుబాటు ధరలను కల్పించి రైతులను ఆదుకుంటాం
- పారిశ్రామికరణతో నిరుద్యోగ యువతకు ఉపాధి
- లోకేష్ యువగళం పాదయాత్రకు జనజోరు

2లో





వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. సోమవారం యువగళం పాదయాత్ర ఆలూరు టిడిపి ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో మండలంలోని ఎంకె కొట్టాల గ్రామం నుండి గుండ్ల కొండ, గుడిమిరాళ్ల, బుర్రకుంట,వెంకటాపురం గ్రామాల మీదుగా పల్లెదొడ్డి గ్రామ సమీపాన రాత్రి బసస్థావరం వరకు సాగింది. ఆయా గ్రామాల్లో నారా లోకేష్ యువగళం పాదయాత్రకు జననీరాజనం హోరెత్తింది. గుండ్లకొండ గ్రామంలో ఆ గ్రామ టిడిపి నాయకులు నీలకంఠం,రాందాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో గజమాలను లోకేష్,కోట్ల సుజాతమ్మకు వేశారు. గుడిమిరాళ్ల గ్రామస్తులు హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా పి కోటకొండ వరకు పిల్ల కాలువల నిర్మాణాలను చేపట్టి సాగునీరు ఇవ్వాలని వినతిపత్రం ఆ గ్రామ నాయకుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో సమర్పించారు. సబ్సీడీ ద్వారా గొర్రెల పెంపకదారులకు గొర్రెల యూనిట్లు,మందులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన నారా లోకేష్ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేస్తామన్నారు.

*దేవనకొండ, ప్రభాతవార్త :*

## లోకేష్ పాదయాత్రతో.. ప్రజలకు ఒరిగేదేమీ లేదు

**- సంక్షేమ పథకాలే జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తాయి**
**- స్త్రీ,శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్**

**మంత్రాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** మాజీమంత్రి,టిడిపి నాయకులు నారా లోకేష్ పాదయాత్ర వలన రాష్ట్ర ప్రజలకు ఒరిగేదేమీ లేదని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖమంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు.సోమవారం ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం విచ్చేశారు.ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ టిడిపి నాయకులు పాదయాత్రలు చేయకముందు అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో ప్రజలకు మేనిఫెస్టో రూపంలో తెలియజేయాలన్నారు.రాష్ట్ర ప్రజలకు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగాగెలిపిస్తాయని తెలిపారు.టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీ వర్గాలకు తాము ఏమిచేశామో మొదటగా తెలుసుకోవాలన్నారు.ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు నేరుగా అవినీతి లేకుండా లబ్దిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఓ మహిళా ఎంఎల్ఏపై టిడిపి నాయకులు అధారాలు లేకుండా అవినీతి ఆరోపణలు చేయడం చాలా దారుణమన్నారు.ఇప్పటికైనా టిడిపి నాయకులు ప్రభుత్వంపై అసత్య అరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి పార్టీకి మరోసారి పరాభవం తప్పదని జోస్యం చెప్పారు.





## మురికి కాలువల సమస్యను.. పట్టించుకోని అధికారులు

**హొళగుంద,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**
మండల పరిధిలోని ఇంగళదహాల్ గ్రామంలోని బిసి కాలనీలో దాదాపు రెండేళ్ల నుండి మురికి కాలువ సమస్య ఎక్కువగా ఉందని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకునేనాథుడే లేదని గ్రామస్తులు,కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పట్టించుకోవడం లేదని,మురికి నీరు రోడ్డుపై చేరి నడవడానికి కూడా రావడం లేదన్నారు. జగనన్న కాలనీకి వెళ్లే దారిలో మట్టి వేయించారని అయితే రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు మరిచిపోయారన్నారు. దీంతో డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరుతుందన్నారు. దీంతో దోమలు వ్యాప్తి అధికమైందన్నారు. బిసి కాలనీ నుండి పాఠశాలకు వెళ్లే చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కావున రోడ్డుపై మురుగునీరు చేరకుండ వెంటనే డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## అయ్యా..గొంతెండుతోందయ్యా.. సమస్యను పరిష్కరించండయ్యా..

**- వేసవి రాకతో ఎస్‌సి కాలనీలో నీటి కొరత**
**- తాగునీటి కోసం కాలనీవాసులు నానా ఇక్కట్లు**

**తుగ్గలి,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**
ఒకవైపు మండుతున్న ఎండలు..వడగాల్పులు..మరోవైపు గుటికెడు తాగునీటి కోసం అల్లాడుతున్న జనం..మండల కేంద్రమైన తుగ్గలిలోని ఎస్‌సి కాలనీలో తీవ్రంగా మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. వేసవి రాకతో కాలనీలో తాగునీటి కొరత నెలకొంది. ఎస్‌సి కాలనీలోని అంగన్‌వాడి సెంటర్ వద్ద ఉన్న బోరు బావిలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ విద్యుత్ బోర్డులో సమస్య తలెత్తడంతో వారానికి పైగా తాగునీటి కష్టాలు తీవ్రరూపం దాల్చాయి. తాగునీటి కోసం కాలనీవాసులు తమ పనులను పక్కనబెట్టి కుళాయిల వద్ద పడిగాపులు కాస్తున్నప్పటికీ నీరు దొరకడం లేదని వాపోతున్నారు. లేదా వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. తాగునీటి కోసం ఎస్‌సి కాలనీలో ఏర్పాటు చేసిన సిమెంటు ట్యాంకులు ఉన్నప్పటికీ వాటిలో నీరు లేక ఖాళీ ట్యాంకులు దర్శనమిస్తున్నాయి. ఇలానే ట్యాంకులను వదిలేస్తే ఎండవేడికి ట్యాంకులు చీలికలు ఏర్పడి తాగునీరు వృధా అయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు గమనించి ఎస్‌సి కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.



## వసతి గృహాలను అధికారులు తనిఖీలు చేయాలి

**- వడగాల్పులపై ప్రజలు అప్రమత్తమయ్యేలా వైద్యశాఖ చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టరు**

**నంద్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్ అధికారులను అదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్ఆర్ సెంటనరీ హాల్‌లో స్పందన కార్యక్రమం జేసి టి నిశాంతి, ఇంచార్జీ డిఆర్వో కామేశ్వర్‌రావులు అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన సమస్యలు మొక్కుబడి రీతిలో పరిష్కరించకుండా నాణ్యతతో పరిష్కారం చూపాలన్నారు. మున్సిపల్ పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుద్య చర్యలు ముమ్మరం చేసి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను అదేశించారు. వసతి గృహాల్లో పారిశుద్దచర్యలు పాటిస్తు విద్యార్థుల్లో రక్తహీనత అధికమించెందుకు మెను ప్రకారం పోషకాహారంతో కూడిన ఆహార పదార్థాలను అందజేయాలన్నారు. వసతి గృహాలను హాస్టల్ వేల్ఫేర్ అధికారులు తరుచు తనిఖీలుచేసి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండకాలంలో వడగాల్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేవిధంగా వైద్యశాఖ అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం వేదికలో కొన్ని వినతులు కొత్తపల్లె మండలం గుమ్మడాపురం నివాసి జి భారతీ తన భర్త వదలిపెట్టి 15 సంవత్సరాలు అయిందని తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని వారిని పోషించకుండా నాభర్త రెండవ పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడని ఇటీవల నా రెండవ కుమార్తె డెంగ్యూ జ్వరం వచ్చి మరణించిందని నా జీవనం కష్టంగా ఉందని హాస్టల్‌లో కమాటి పోస్టు ఇప్పించాలని కోరారు. కోవెలకుంట్ల మండలం కలగొట్ల గ్రామంలోని ఎస్సీలందరు గత కొన్ని సంవత్సరాలుగా చెన్నకేశవదేవాలయ మాన్యంలోని కొండభాగంలో స్మశానంగా వినియోగిస్తున్నామని ప్రస్తుతం మా స్మశానంలోని సమాధులు తీసివేసి శుభ్రం చేసుకొని చెబుతూ మా కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎస్సీలమైన మాకు స్మశానం కోసం న్యాయం చేయాలని కలెక్టరును కోరారు. నంద్యాల పట్టణ నివాసి రాధమ్మ తన తండ్రి అనారోగ్యంతో శాంతిరాం ఆసుపత్రిలో చికిత్స చేయించానని పిహెచ్‌సి కార్డు ద్వారా వెసులుబాటు కల్పిస్తు ఖర్చు మొత్తాని వెనక్కు ఇప్పించాలని కోరారు. ఇంకా ఈకార్యక్రమంలో 170 మంది అర్జీదారులు సమస్యల పరిష్కారం కొరకు కలెక్టరుకు అర్జీలు ఇచ్చుకున్నారు.



## ఎద్దుల బండలాగు పోటీలను ప్రారంభించిన కోట్ల

**టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి**

**గూడూరు,ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** గూడూరు పట్టణంలో వెలసిన శ్రీతిమ్మగురుడు స్వామి జాతరను పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగు పోటీలను సోమవారం టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఆయా ప్రాంతాలకు చెందిన 8 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీలలో మొదటి స్థానం కొత్తకోట గ్రామానికి చెందిన మధుసూదన్‌రావుకు చెందిన ఎద్దులకు రూ.50వేలు,రెండవ స్థానంను కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన తిరుమలేషు ఎద్దుల జతకు రూ.40వేలు,మూడవ స్థానంను అనంతపురం గ్రామానికి చెందిన వీరేష్ ఎద్దుల జతకు రూ.30వేలు, నాల్గవస్థానంను మానవపాడు సుధాకర్‌కు చెందిన ఎద్దుల జతకు రూ.20వేలు,ఐదవ స్థానం లక్ష్మీనారయణకు చెందిన ఎద్దుల జతకు రూ.10వేల రూపాయలను,ఆరవ స్థానం మునగాల గ్రామానికి చెందిన హనుమంతు ఎద్దుల జతకు రూ.5వేలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జులకల్ సుధాకర్‌రెడ్డి, చరణ్‌కుమార్, భాస్కరరెడ్డి, చెట్టుకింద మద్దిలేటి, వడ్డే నాగేష్,అద్దాల నాయుడు, రాజారెడ్డి, ఆకేపోగు చిన్న బతకన్న,గుడిపాడు చంద్రారెడ్డి,చెట్టుకింద నారాయణ,రేవుల గోవిందు, ఉప్పరి లక్ష్మన్న, బి.కిశోర్‌వర్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## పరిమితికి మించి ఆటోలో ప్రయాణం...

- ప్రయాణానికి భద్రతేదీ....
- ప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటీ...?
- తుంగలో తొక్కుతున్న నిబంధనలు
- కూలీల ప్రాణాలతో చెలగాటం

**గడివేముల, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** పొట్టకూటి కోసం పనిచేసే కూలీలతో చెలగాటమాడుతున్నారు ఆటో డ్రైవర్లు. గడివేముల మండలకేంద్రం, వివిధ గ్రామాల్లో ఉన్న కూలీలు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. పనుల కోసం మండలంలోని వివిధ గ్రామాలకు పనులు చేసుకోవడానికి ఆటోల్లో వెళ్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి కూలీలను తీసుకెళ్లడం ప్రమాదకరమే అని ఆటో డ్రైవర్లకు తెలిసినా కూడా కూలీల ప్రాణాలతో ఆటో డ్రైవర్లు చెలగాటమాడుతున్నారంటూ మండల ప్రజలు అంటున్నారు. ఆటోలపైన, ఆటో వెనక మరియు మధ్యలో దాదాపు 18 మంది దాకా వెళ్తున్నారనీ, ఇంతమందిని ఆటోలో ఎక్కించుకున్న ఆటో డ్రైవర్ ఏమాత్రం ఆదమరిస్తే కూలీల ప్రాణాలు అంతే సంగతులేనని చెప్పనవసరం లేదు. ఓవర్‌లోడుతో ఆటోలను నడుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆటో డ్రైవర్‌లకు అధికారులు కళ్లెం వేస్తారా... అలాంటి వారి పట్ల అధికారులు తగిన చర్యలు తీసుకుంటారా...? ప్రమాదాలకు అధికారులు ఫుల్ స్టాప్ పెడతారా.... వేచి చూడాల్సిందే.



## ప్రజలపై నమ్మకాన్ని పెంపొందించాలి

**- పోలీస్ స్పందనకు 72 ఫిర్యాదులు**

**నంద్యాల క్రైం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పోలీసులు స్పందనకు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు తక్షణమే పరిష్కారం చేసి ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. ప్రతిసోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో నిర్వహిస్తారు. డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐలతో పాటు స్పందనలో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని సంబంధిత అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలోని ఫిర్యాదుదారుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని అదేశించారు. స్పందన ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. సివిల్ తగాదాలు, అన్నదమ్ముల మధ్య అస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు మొదలగు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించాలని తెలిపారు. ప్రతిసోమవారం జిల్లాలో సబ్‌డివిజన్ పోలీస్ పరిధిలో పోలీసుస్టేషన్, సర్కిల్ అఫీసు, డిఎస్పీ అఫీసుల్లో స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా పోలీస్ కార్యాలయానికి సమాచారాన్ని చేరవేయాలన్నారు. ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి సిఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే నీరజా రెడ్డికి నివాళి

**- మాజీ ఎంపీ టిజి వెంకటేష్**

**కర్నూలు విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌నుంచి కర్నూలుకు వస్తు నిన్న ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే పాటిల్ నీరజారెడ్డి మృతదేహాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ప్రమాదంలో అకస్మికంగా మృతిచెందడం పట్ల టీజి వెంకటేష్ తీవ్ర దిగ్ర్భాంది వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కపిలేశ్వరయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం..

**(మొదటి పేజీ తరువాయి ) :** బుర్రకుంట గ్రామ సమీపంలో ఆలూరు నియోజకవర్గ పరిధిలోని రైతులతో ముఖాముఖీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ మండలాల రైతులు రైతాంగ సమస్యలను విన్నవించారు. ఆస్పరి,దేవనకొండ ప్రాంతాల రైతులు అధిక విస్తీర్ణంలో టమోటా పంటను సాగు చేస్తారని జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆయా మండలాల రైతులు విన్నవించారు. అందుకు స్పందించిన ఆయన జ్యూస్ ఫ్యాక్టరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. తెర్నేకల్ గ్రామ రైతు ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు చెల్లిస్తున్న వేతనాల్లో కోత విధించారని,హంద్రీనీవా పంట కాలువలు అసంపూర్తిగా ఉన్నాయని తక్షణమే వాటిని పూర్తి చేయించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు. పొట్లపాడు రైతు లక్ష్మన్న మాట్లాడుతూ ఉల్లి పంటకు గిట్టుబాటు ధర గత రెండేళ్లుగా లేకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని దీంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. అందుకు స్పందించిన నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వేదావతి,నగరదోన, హంద్రీనీవా,ఎల్ఎల్‌సి, ఆర్డిఎస్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను ఆదుకుంటామన్నారు. గత నాలుగేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి పరిశ్రమలు స్థాపించలేకపోయారని టిడిపి ప్రభుత్వం వస్తే కర్నూలు జిల్లాకు పరిశ్రమలు పెట్టడానికి పెద్దఎత్తున పెట్టుబడులు వ్యాపార వర్గాల నుండి తెప్పిస్తామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేసి పండ్ల తోటల పెంపకాన్ని రైతులతో చేపట్టి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం రైతాంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు గైకొనకపోవడంతో రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడోస్థానంలో,కౌలురైతుల ఆత్మహత్యల్లో రెండోస్థానంలో ఉందన్నారు. మిగులు గోదావరి జలాలను రాయలసీమకు తరలిస్తామన్నారు. టిడిపి హయాంలో 72శాతం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తయ్యాయని వైసిపి ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సీడీని వైసిపి ప్రభుత్వం ఎత్తేసిందని,సబ్సీడీ రైతు రథాలు,వ్యక్తిగత వ్యవసాయ స్ప్రేయర్లు, పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు ప్రతి ఇంటికి మంచినీటిని అందించే భాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనంగా వైసిపి ప్రభుత్వం అప్పులు తెచ్చుకునేందుకు వారు ఏ విధంగా చెబితే ఆ విధంగా పాలన చేస్తుందని మీటర్లు బిగించడానికి వస్తే తిరుగుబాటు చేయాలని సూచించారు. పాలన అనుభవం ఉన్న వ్యక్తి చంద్రబాబునాయుడు అని ఒక్కసారి అవకాశం ఇవ్వండని పదవిలోకి వచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అందుకే పాలన గాడి తప్పి పేద,మధ్య తరగతి ప్రజలపై ఆర్టీసి బస్సు చార్జీలు,కరెంటు చార్జీల రూపంలో పెనుభారం మోపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆలూరు, మంత్రాలయం, ఆత్మకూరు టిడిపి ఇంచార్జ్‌లు కోట్ల సుజాతమ్మ, తిక్కారెడ్డి,ఏరాసు ప్రతాప్‌రెడ్డి,ఎమ్మెల్సీ బిటి నాయుడు,టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, ఆలూరు టిడిపి మాజీ ఇంచార్జ్‌లు వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జునచౌదరి,టిడిపి పారిశ్రామికవేత్త,మాజీ ఇంచార్జ్ వైకుంఠం శివప్రసాద్ ఆయన భార్య జ్యోతి,మసాల పద్మజ,ఆస్పరి మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ,మాజీ ఎంపిపి రామచంద్రనాయుడు, నాయకులు బడిగింజల రంగన్న, రామారావు నాయుడు,మల్లికార్జునగౌడ్,వెంకటస్వామిగౌడ్, రాజశేఖర్‌గౌడ్,బండ్లయ్య,మాలిక్ భాషా, రాజా సాబ్, సర్పంచ్‌లు శేషిరెడ్డి, భాస్కర్, మహేశ్వం రెడ్డి,ఎంపిటిసి తిమ్మప్ప, లక్ష్మన్న ,రామాంజనేయులు, శివన్న,మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## మే 13న జాతీయ లోకాదలత్

**నందికొట్కూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** జాతీయ లోకాదలత్ మే 13వ తేదీన నిర్వహించబడుతుందని సీనియర్ సివిల్ జడ్జీ దివాకర్ తెలిపారు. లోకాదలత్‌లో రాజీ మార్గాన పరిష్కారం చేసుకోవడానికి చక్కటి అవకాశమని, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్, అర్హత కలిగిన కేసులను లోకాదలత్‌లో పరిష్కారించకోవడానికి వేదికగా ఉంటుందని కావున దీనిపై పోలీసులు వారికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వాసుపత్రి సమస్యలకు నిలయం

**కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిన కర్నూలు జిల్లా ప్రభుత్వాసుపత్రి నేడు సమస్యలకు నిలయంగా మారిందని ఎస్‌డిపిఐ నాయకులు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎస్‌డిపిఐ నగర అధ్యక్షులు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వాసుపత్రిక రాయలసీమ జిల్లాల నుంచే కాక బళ్లారి, మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల నుంచి కూడ ప్రతి దినం దాదాపు 2700 మంది నుంచి 3000 మంది రోగులు చికిత్స కొరకు వస్తుంటారు. వారిలో 400 మంది ఇన్‌పేసెంట్లు చేరుతున్నారు. ఎనిమిది జిల్లాల పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్య ప్రధాయినిగా పేరుపొందింది. అయితే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వాసుపత్రి నేడు సమస్యలకు నిలయంగా మారింది. ఆ సమస్యలను ప్రజాసంఘాల తరుపున కలెక్టరు దృష్టికి తీసుకువస్తున్నట్లు సమస్యల పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా వేడుకుంటున్నాం. ఆసుపత్రికి సంబంధించిన కొన్ని సమస్యలు అన్ని క్యాటగిరిల్లో 4వ తరగతి ఉద్యోగుల, పారామెడికల్ ఉద్యోగుల నియమకాన్ని తక్షణమే చేపట్టి కిందిస్థాయి ఉద్యోగుల కొరత తీర్చాలి. రక్త, మల మూత్ర పరీక్షలు నిర్వహించే ల్యాబ్ సిబ్బంది సంఖ్య పెంచాలి. ల్యాబ్ 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రిలో అక్సిజన్ ప్లాంట్‌లు అన్నింటిని రిపేరి చేయించాలి, ఆసుపత్రిలో 24 గంటలు నీటి సరఫరా ఉండేలా చూడాలి. ఓపి రసీదు కౌంటర్ల సంఖ్యను పెంచాలి.రోగులకు త్వరగా వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.అన్ని రకాల మందులను ఉచితంగా ఇవ్వాలి.కార్యక్రమంలో సిటి ప్రసిడెంట్ అష్పాక్ వుశేన్, హబిబ్‌ఖాన్, షెక్ అబ్దుల్లా, షఫి, అహమ్మద్, జలీల్, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు అవోపా ఆధ్వర్యంలో ఉచిత పాలు పంపిణీ

**ఆదోనిలీగల్, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** ఆదోని పట్టణంలోని నగరేశ్వర ఆలయంలో మంగళవారం అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మహిళా విభాగం ఆధ్వర్యంలో 1000 మందికి ఉచిత పాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అవోపా రాష్ట్ర చైర్మన్ అరవేటి నిర్మల, సెక్రటరీ సంగీత, మమతశ్రీ, కోశాధికారి హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ అవోపా ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు చెప్పారు. గతంలో తమ అవోపా ఆధ్వర్యంలో కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడం జరిగిందన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. మానవసేవే మాధవ సేవ అని చెప్పారు. ప్రతిఒక్కరు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## దొంగతనాల నివారణకై అవగాహన కార్యక్రమం

**బేతంచెర్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** పట్టణంలో దొంగతనాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సీఐ ప్రీతమ్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఆటో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పట్టణ ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు విలువైన బంగారు ఆభరణాలను,డబ్బులను బ్యాంకుల్లో కాని,లాకర్లల్లో కాని పెట్టుకుని వెళ్లాలని సూచించడం జరిగింది.అలాగే అవసరమైన మేరకు మాత్రమే ఆభరణాలను ఇళ్లల్లో ఉంచుకోవాలని మిగిలిన వాటిని సురక్షితమైన ప్రదేశాలల్లో దాచుకోవాలన్నారు.ఇళ్లకు తాళాలను నాణ్యమైన వాటిని వినియోగించాలని సూచించారు.ఏదైనా శుభకార్యాలు,ఇతర పనుల నిమిత్తం ఇళ్ల నుండి వెళ్లినప్పుడు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.ఆటోను వీధి వీధినా తిప్పుతూ ప్రచారం కొనసాగించారు.

## పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

**– ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి**

**బేతంచెర్ల,ఏప్రిల్17,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను మండలంలోని పాలిసెట్ రాసే విద్యార్థుల కోసం పూర్వ శేషారెడ్డి ఉన్నత పాఠశాల నందు ఈనెల 19వ తేది నుండి మే 8వ తేది వరకు నిర్వహించే ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి,నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డిలు అన్నారు.సోమవారం పాలిటెక్నిక్ కళాశాల ఓఎస్‌డీ రాజేష్ ఆధ్వర్యంలో వారు ఉచిత కోచింగ్ పోస్టర్లను వైసీపీ సీనియర్ నాయకులు బాబుల్‌రెడ్డి,గూని నాగరాజులతో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో గతంలో ఉన్న మూడు కోర్సులతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అధునాతన కోర్సును కూడా బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకురావడం జరిగిందన్నారు.ప్రతి కోర్సుకు 60 మంది చొప్పున విద్యార్థులకు ప్రవేశం ఉంటుందన్నారు.పాలిసెట్ ద్వారా నిర్వహించే ప్రవేశపరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఆయా కోర్సుల్లో ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు.కనుక విద్యార్థులు ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని మే 10వ తేదిన జిల్లాలోని శ్రీశైలం,నంద్యాలతోపాటు బేతంచెర్లలో జరిగే ప్రవేశ పరీక్షలో పాల్గొనాలని వారు కోరారు.టెక్నికల్ విద్యను అభ్యసించి మెరుగైన ఉపాధిని పొందాలని యువతకు వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పీఏ శ్రీనివాసరెడ్డి,మెకానికల్ సీనియర్ లెక్చరర్ శేఖర్,మద్దిలేటిస్వామి ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు,వైకాపా నాయకులు మురళీకృష్ణ,తిరుమలేశ్వరరెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతం పరీక్ష ప్రశాంతం

**నంద్యాల విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** జిల్లాలో పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవరంతో ముగిశాయి. పరీక్ష చివరి రోజు అయిన సంస్కృతం పరీక్ష ప్రశాంతంగా జరిగింది గతంలో 125 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేవారు. సంస్కృతానికి మాత్రం 69 పరీక్ష కేంద్రాల్లో 2617 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా అందులో 2614 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 99.88 శాతం హాజరుకాగ కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రం పరీక్షకు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం అనురాధ రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. 5 ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్‌లు 16 కేంద్రాలను తనిఖీచేశారు. జిల్లా వ్యాప్తంగా పదవతరగతి పరీక్షలు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా అధికారులు చీఫ్ డిపార్టుమెంటల్, ఇన్విజిలెటర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే పరీక్ష సమయంలో జిల్లాలో మాస్‌కాపీయింగ్ పేరిట 18మంది ఉపాద్యాయులపై సస్పెన్షన్ చేసి క్రిమినల్ కేసులు నమోదుచేసి జైలుకు పంపిన సంఘటనలు ఉన్నాయి. ఈసారి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరగడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

## వైఎస్ఆర్ భీమా తక్షణ సహాయం పంపిణి

**ప్యాపిలి ఏఫ్రిల్17(ప్రభాతవార్త):** మండల పరిధిలోని చంద్రపల్లె గ్రామానికి చెందిన ఈడిగ కృష్ణుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఇంటి యజమాని మృతి చెందిన క్రిష్ణుడు కుటుంబానికి సోమవారం వైఎస్ఆర్ భీమా పథకం కింద తక్షణ సహాయంగా మంజూరైన పదివేల రూపాయలను సర్పంచ్ జోన్నగిరి సరోజమ్మ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ యజమాని మృతి చెందిన సమాచారాన్ని సచివాలయ సిబ్బందికి చేరవేసి వైఎస్ఆర్ భీమా అందేలా చేశామని పేర్కొన్నారు. మట్టి ఖర్చులకు తక్షణ సహాయం కింద పదివేల రూపాయలను అందించామని, మిగిలిన డబ్బులు బాధితుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని వివరించారు. వైఎస్ఆర్ భీమా తక్షణ సహాయం అందించిన సర్పంచ్ జోన్నగిరి సరోజమ్మకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్పేర్ అసిస్టెంట్ నాగార్జున పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రప్రభుత్వాన్నిసాగనంపుదాం -సిపిఐ

**పగిడ్యాల, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** ప్రజావ్యతిరేక విధానాలుఅవలంభిస్తున కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపాలనీ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలోపడిందనీ మండల సిపిఐ కార్యదర్శి అబ్దుల్ మజీద్ అన్నారు.సిపిఐ పార్టీ ప్రచారబేరి రాష్ట్రకమిటీ పిలుపు మేరకప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపి నిసాగనంపుదాం -దేశాన్ని కాపాడుదాం అనీ పగిడ్యాల మండలం ప్రాతకోటలోకార్యక్రమం సోమవారం నిర్వహించారు. దేశసమైక్యత సవగ్రత రాజ్యాగంగ విలువల పరిరక్షణ రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీల అమలు విశాఖ ఉక్కుపరిరక్షణకార్పోరేషన్‌దోపిడికి చెల్లుచీటి రాష్ట్రాభివృద్ధి సామాన్య ప్రజల రక్షణే ప్రధానకర్తవ్యంగా పనిచేయవలసిన బాధ్యత ఎంతైనావుందన్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో పర్యటించికరపత్రాలను అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో భీముడు,వెంకటేశ్వర్లు, రహిమాన్, గాంధీ,తదితరుపాల్గొన్నారు.

## ఎ.ఎన్.ఎం.పై చర్యలు తీసుకోవాలని ఆశావర్కర్లు ధర్నా

**నందికొట్కూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ఆశా వర్కర్ నజిరున్నిషా ఆత్మహత్య యత్నానికి కారణమైన ఎ.ఎన్.ఎం.సావిత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతు సి.ఐ.టి.యు.ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు.నాయకులు కె.బాస్కర్‌రెడ్డి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగమణి, జిల్లా కార్యదర్శి రమణకుమారి మాట్లాడుతు చాలిచాలని వేతనాలతో సేవలు అంధిస్తున్న ఆశావర్కర్లను వేధించడం దారుణమని, ఎంతో కాలంగా పనిచేస్తున్న వారిని ఎ.ఎన్.ఎం.కక్షపూరితంగా వ్యవహారించడం దారుణమని వెంటనే ఆమెను విధుల నుండి తప్పించాలని లేని పక్షంలో ఆంధోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు జయరాణి, ఆశావర్కర్లు లక్ష్మి, మంజుల, మధలత, పద్మావతి, సి.ఐ.టి.యు.నాయకులు పాల్గొన్నారు.

## విధ్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం ధగ్ధం

**కొత్తపల్లి,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** మండలంలోని ఎదురుపాడు గ్రామం అత్యంత సమీపంలో ట్రాక్టర్‌పై తెస్తున్న పశుగ్రాసానికి విధ్యుత్ తీగల తగిలి ధగ్ధమైంది. సోమవారం శ్రీకాంత్ అనే వ్యక్తి పగిడ్యాల మండలం వనములపాడు గ్రామం నుండి పశుగ్రాసం కొనుగోలు చేసి ఎదురుపాడుకు తెస్తుండగా విధ్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన ట్రాక్టర్ డ్రైవర్ దూరంగా పోయి పశుగ్రాసాన్ని కిందికి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. పశుగ్రాసం విలువ రూ.20వేలు అవుతుందని భాధితుడు తెలిపారు.

## గ్రామ సర్వేయర్లకు 5జి సిమ్‌లు పంపిణీ

**మంత్రాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలో గ్రామ సర్వేయర్లుగా విధులు నిర్వహిస్తున్న సర్వేయర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన డైరీలు,5జి సిమ్‌లను మండల తహశిల్దార్ దేవ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు.మండలంలోని 20 మంది గ్రామ సర్వేయర్లకు వీటిని పంపిణీ చేసినట్లు తహశిల్దార్ చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూహక్కు,భూసర్వే పథకంలో భాగంగా గ్రామాలలో రైతులకు మెరుగైన సేవలు అందించే నిమిత్తం ఈ సిమ్‌లను పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశిల్దార్లు రాఘవేంద్ర,సరస్వతి, మండల సర్వేయర్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఆధార్ సెంటర్లు ప్రారంభం

**హొళగుంద,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన హొళగుందలోని గ్రామ సచివాలయంలో నేటి నుండి మూడురోజుల పాటు మరియు 26,27తేదీల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ దాసునాయక్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని సచివాలయంలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఆధార్ సెంటర్లలో పేరు మార్పు,ఫోటో మార్పు,అడ్రస్,పేరు అచ్చుతప్పులు ఏవైనా ఉంటే సరిచేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఆధార్ సెంటర్‌లో ఆధార్ ఆపరేటర్‌కు ఇద్దరు వాలంటరీలు,ఇద్దరు సెక్రటరీలు ఉంటారన్నారు.

## 120 మంది పేద ముస్లీంలకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

**కోడుమూరు,ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** కర్నూలు కె.ఎం ఆసుపత్రి ఆధ్వర్యంలో కోడుమూరుకు చెందిన ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ సహకారంతో సోమవారం రంజాన్ తోఫా కిట్లను స్థానిక ముస్లీం సంఘం పెద్దలు అందజేశారు. గత మూడేళ్ల నుంచి పట్టణంలోని పేద ముస్లీంలకు ఐఎఎస్ అధికారి ఇంతియాజ్ రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆయన ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. ఈ ఏడాది కూడా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముస్లీం సోదరులు కలిసి విజయవంతం చేశారు. ఈ కార్య క్రమంలో చిన్నమస్జీద్ కమిటి సభ్యులు ముత్తవలి,జె.ఇక్బాల్,ఇంతియాజ్,ఎండి ఫరూక్,సజ్జు,అజీజ్,అజీంలు పాల్గొన్నారు.

## దోపిడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**నంద్యాల టెక్కె, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** కార్పొరేటర్లకు,దోపిడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపేందుకు ప్రజలందరూ కలిసికట్టుగా తరలి రావాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. మోదీ హఠావో...దేశ్‌కో బచావో ప్రచారభేరి పాదయాత్రను నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌లు మాట్లాడుతూ బీజేపీ పాలనలో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని దేశ ప్రజల మధ్య మత విద్వేషాలను రాజేస్తుందని అన్నారు. ప్రబుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసి దేశ సంపదను దోచిపెడుతుందని ఇప్పటికే హెడెన్‌బర్గ్ సంస్థ రూ.12లక్షల కోట్ల కుంభకోణాన్ని భయటపెట్టిందని ధ్వజమెత్తారు. ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని దేశంలో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం శోచనీయమన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. బీజేపీ చెప్పుచేతుల్లో నడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలపై భారాలు మోపుతున్న బీజేపీని తెదేపా, జనసేన వంటి ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటని అన్నారు. మరలా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రేవేటు పరం చేస్తారని ప్రజలకు కూడు, గుడ్డ లేకుండా చేస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నేడు మాట మారుస్తూ నిధులు ఇవ్వకుండా చేస్తుందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, కార్యదర్శి శివయ్య, ఉపాధ్యక్షుడు సురేష్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు నారాయణమ్మ, నాయకులు మాబాషా తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ కర్తవ్య దీక్ష కరపత్రాలను ఆవిష్కరించిన కాటసాని రమాకాంత్‌రెడ్డి

**అవుకు,ఏప్రిల్17,ప్రభాతవార్త:** రాయలసీమ హక్కులకై కర్నూలు పట్టణంలో జరిగే ఒక్క రోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి చేతుల మీదుగా రాయలసీమ కర్తవ్య దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు.అలాగే పలు పార్టీల ప్రజాప్రతినిధులతోపాటు బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు చేతుల మీదుగా కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు ఆర్‌వీఎస్ సీమకృష్ణ మాట్లాడుతూ రాయలసీమకు నీళ్లు,నిధులు,నియామకాలల్లో సమాన వాటా కోసం రాయలసీమ కర్తవ్య దీక్షను విజయవంతం చేయాలని అన్ని పార్టీల నాయకులను,ప్రభుత్వ అధికారులను పిలవడం జరుగుతుందని తెలియజేశారు.అదే విధంగా సిద్దేశ్వరం,సంగమేశ్వరం వద్ద కృష్ణ నది పై ఐకానిక్ బ్రిడ్జి బదులు రోడ్డు కం బ్యారేజీని నిర్మించాలని మరియు అప్పర్‌భద్ర ప్రాజెక్టు కర్నాటక ప్రభుత్వం నిర్మించడం వల్ల రాయలసీమకు తుంగభద్ర నది నుండి రావాల్సిన నికర జలాలు హెచ్ఎల్సీ,ఎల్ఎల్సీ మరియు కేసీ కెనాల్,భైరవానితిప్ప ప్రాజెక్టు రైతులకు నీళ్లు రావన్నారు.వెంటనే ఆ ప్రాజెక్టును నిలుపుదల చేయాలని కోరుతూ మరియు శ్రీబాగ్ ఒప్పందాన్ని పూర్తిగా అమలుచేసి నీళ్లు,నిధులు,నియామకాలల్లో న్యాయం చేయాలని కోరుతూ ఏప్రిల్ 24వ తేదిన కర్నూలు పట్టణంలోని ఎస్టీబీసీ మైదానంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఒక్కరోజు నిరసన కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారన్నారు.ఈ కార్యక్రమంలో నాగభూషణం,బంజారి గోపాల్,సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థికసహాయం

**పగిడా్యల, ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** పగిడ్యాల గ్రామపంచాయతీ పరిధిలోని జిన్నువీధిలో నివాసంవుంటున్న మాదేపోగు జాన్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో వైఎస్సార్ భీమా కింద మృతుడి కుటుంబానికి రూ. 10000లు ఆర్థికసహాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాల శేషన్న, మండల విస్తరణాధికారి పుల్లయ్య,వేల్పేర్ అసిస్టెంట్ నర్సిహులు, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, మంజుల,వాలంటీర్ మనీష గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రతిరైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి

**– ఏడిఎ సునీత**

**ఆలూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** ప్రతిఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఆలూరు ఏడిఎ సునీత అన్నారు. సోమవారం పట్టణంలో భూసార శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడిఎ సునీత మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేసుకోవడం వలన పొలంలో ఏఏ పోషకాలు ఎంతమేర ఉన్నాయో..మనం వేయబోయే పంటకు ఎంత అవసరం అనేది తెలుస్తుందన్నారు. అలాగే మనం పంటకు అవసరమైన మేరకు ఎరువులు వేయడం వల్ల అనవసరమైన ఖర్చు తగ్గించి అధిక ఆదాయం పొందవచ్చాన్నారు. మట్టి పరీక్ష యొక్క ప్రాముఖ్యత,మట్టి పరీక్ష ఎలాచేయాలి,మట్టి పరీక్ష వల్ల లాభాలు,రైతుల మట్టి పరీక్ష పత్రం ఆధారంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రతిరైతు తమ పరిధిలో గల ఆర్‌బికె అంటెంట్స్‌ను కలిసి శాంపిల్స్ తీసుకుని పరీక్ష కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేశ్వరగౌడ్,హబ్ మేనేజర్ రాజేష్,ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## స్కూటీని ఢీకొన్న లారీ

**– సచివాలయ ఉద్యోగినికి గాయాలు**

**మంత్రాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కాచాపురం గ్రామంలో ఓ స్కూటీని లారీ ఢీకొన్న సంఘటనలో సచివాలయ ఉద్యోగినికి గాయాలయ్యాయి.వివరాల మేరకు కాచాపురం గ్రామంలో విలేజ్ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న గాయత్రి అనే సచివాలయ ఉద్యోగిని మధ్యాహ్నం మంత్రాలయం తహశిల్దార్ కార్యాలయంలో మీటింగ్‌కు హాజరు కావాలని తనతో పాటు మరో ఉద్యోగినిని తన స్కూటీపై వెళుతుండగా అకస్మాత్తుగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది.ఈ సంఘటనలో గాయత్రి తలకు గాయాలు కాగా మంత్రాలయంలో వైద్యం అందించారు.అయితే తమ కుటుంబం వారు వచ్చి మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్ళినట్లు తెలిసి ంది.,ప్రస్తుతం ఉద్యోగిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సమాచారం.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన

**హాలహర్వి,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మల్లికార్జున తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా స్పందనలో వచ్చిన అర్జీలను వెంటనే విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. స్పందన కార్యక్రమంలో భూ సమస్యల పరిష్కారం కోసం 5,కొత్త రేషన్ కార్డుల మంజూరు కోసం 22,ఇంటి స్థలాల మంజూరు కోసం 18 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అర్జీలను పరిశీలించి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆంటోని,ఈఓపిఆర్‌డి మల్లికార్జున,పిఆర్ఏఈ వెంకటేశ్వర్లు,ఆయా గ్రామాల విఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ పాదయాత్రకు భారీగా బయలుదేరిన తెలుగు యువ నాయకులు

**హొళగుంద,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామం నుండి తెదేపా కార్యకర్తలు బికె వీరేష్,రాము,మల్లికార్జున, శ్రీకాంత్,మల్లయ్య,సుంకయ్య,నాగేష్‌తో పాటు కార్యకర్తలు భారీగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తుండడంతో లోకేష్ అడుగులో అడుగు వేసేందుకు బయల్దేరి వెళ్లినట్లు తెలిపారు. యువగళం పాదయాత్రలో రాష్ట్ర ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని దీంతో వైసిపి నాయకుల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. జై తెలుగుదేశం..జై కోట్ల..అంటూ నినాదాలు చేస్తూ పాదయాత్రకు బయలుదేరి వెళ్లారు.

## రైతుల అభివృద్ధి కొరకు కృషి చేస్తా

**– ఆలూరు సొసైటీ చైర్మన్ హనుమంతమ్మ**

**ఆలూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** రైతుల అభివృద్ధి కొరకు కృషి చేస్తానని ఆలూరు సొసైటీ చైర్మన్ హనుమంతమ్మ అన్నారు. సోమవారం ఆలూరు సొసైటీ కార్యాలయంలో ఆమె భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతన్నలకు పెద్దపీఠ వేశారన్నారు. రైతుల కోసం అందిస్తున్న రుణాలను రైతులకు అందేలా కృషి చేస్తామన్నారు. రైతులకు అన్నివేళల అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు నియోజకవర్గ ఇంచార్జ నారాయణస్వామిలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సొసైటీ డైరెక్టర్లు అరికెర వెంకటేశ్వర్లు,మారెప్ప,బ్యాంక్ మేనేజర్,సిఈఓలను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఏరూరు శేఖర్,మండల కన్వీనర్ వీరేష్,సొసైటీ చైర్మన్ తనయుడు పెట్రోల్ బంక్ కిషోర్,కోకన్వీనర్ హనుమయ్య,నాయకులు వరుణ్,వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదప్రజలకు సంక్షేమ పథకాలు

**– వైసిపి యువ నాయకులు కాకర్ల శాంతికుమార్**

**దేవనకొండ,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని వైసిపి యువ నాయకులు కాకర్ల శాంతికుమార్ అన్నారు. జగనన్నే మా నమ్మకం-జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవనకొండలోని పాత మార్కెట్ నందు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా లబ్దిదారుల ఇంటి దగ్గరికి వెళ్లి సిఎం జగన్ అందిస్తున్న పథకాల గురించి జగనన్న చేసిన మేలు గురించి వివరించడం జరిగింది. ఈ సందర్బంగా మహిళలు సిఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటరీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్ వల్ల గడ్డివాము దగ్ధం

**-రూ.30వేలు ఆస్తినష్టం**

**హొళగుంద,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో సోమవారం రైతు నాగరాజు పొలం నుండి గడ్డివామును ఇంటికి ట్రాక్టర్ ద్వారా తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి గడ్డివాము దగ్ధమైనట్లు బాధితుడు నాగరాజు తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పొలం నుండి ట్రాక్టర్ ద్వారా వరిగడ్డిని ఇంటికి తీసుకొస్తున్న సమయంలో గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ ట్రాలీ,గడ్డివాము దగ్ధమైందని వాపోయారు. సకాలంలో గ్రామస్తులు,స్థానికులు అప్రమత్తమవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని యువకులు నీరు చల్లి కొంతవరకు మంటలను అదుపు చేశారు. ట్రాక్టర్ ట్రాలీ టైర్లకు ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. దాదాపు రూ.30వేలు ఆస్థినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గాలను నిలదీయాలి

**వెలుగోడు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందని లేదంటే దేశ భవిషత్తు చిమ్మ చీకటి అయిపోతుందని వామపక్ష నాయకులు విమర్శించారు. సోమవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార బేరి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సంధర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు, సిఐటియు మండల అధ్యక్షులు వాదం నాగమోహన్ మాట్లాడుతు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి దుర్మార్గాలను ఎండ గట్టాలన్నారు. మోడీ అమిత్‌షా నాయకత్వంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ కూటమి కలిసి ప్రజల మధ్య విధ్వేశాలు రాజేస్తున్నారని, ప్రశ్నించే వారిని అణిచివేస్తున్నారని, మన స్వాతంత్రం పెనుప్రమాదంలో పడిందన్నారు. జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్ళీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఏప్రిల్ 14 నుండి 30 వరకు వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే ప్రచార కార్యక్రమాలలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, ఎర్రబాష, మహమ్మద్, ఆంజినేయులు, లింగన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ పనితీరుపై రిజినల్ డైరెక్టర్ ఆగ్రహం



**జూపాడుబంగ్లా, ఏప్రిల్ ,17 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని అంగన్‌వాడీ కేంద్రం-4 చెందిన టీచర్ సునిత పనితీరుపై స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజినల్ డైరెక్టర్ పద్మజ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని అంగన్‌వాడీ సిబ్బంది,కాలం చెల్లిన పామాయిల్ వినియోగం, ఆందోళనలో గర్భవతులు బాలింతలు అనే శీర్షిక వార్తా దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన వార్తాకు అర్‌జెడీ స్పందించి సోమవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మీకంగా తనికీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంపై ఆర్‌జెడీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించపోవడంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేవారు. రిజిస్ట్రర్‌లో కేంద్రం తనిఖీ సమయంలో అంగన్‌వాడీ టీచర్‌కు సంబంధించిన రిమార్కులను సూపర్‌వైజర్ నమోదు చేయకపోవడంతో ఆమె పనితీరు పై ఆర్‌జెడి అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో ఉన్న చిన్నారులకు హాజరు పట్టికలో నమోదు చేసిన సంఖ్యలో తేడా ఉన్నట్లు ఆర్‌జెడి విచారణలో వెల్లడైంది. కేంద్రానికి ప్రీ స్కూల్ 10 మంది హాజరైతే ఆన్‌లైన్ హాజర్‌లో 14 నమోదు చేసినట్లు వెల్లడైంది. కోడి గుడ్ల ఎందుకు పంపిణీ చేయలేదని, గర్భవతులకు ప్రసవ సమయంలో కౌన్సిలింగ్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహిరించడం, గర్భవతుల హెచ్‌బి కూడా నమోదు చేయకుండా ఉండడంపై ఆర్‌జెడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మజ విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం-4పై ఫిర్యాదులు అందడంతో తాము ఆకస్మీకంగా తనికీ చేయడం జరిగిందన్నారు. రికార్డుల నిర్వాహణ ఆధారంగా టీచర్ సునితపై చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో సూపరిన్‌డెంట్ మంజులావాణి, ఎపిడి పిఓ సౌజన్యకుమారి, అదనపు సిడిపిఓ మంగవల్లి, మహిళా పోలీసు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సుజల పైపుల కర్మాగారంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం

**నంద్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం బొమ్మలసత్రంలోని సుజల పైప్స్ కర్మాగారంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ, నంద్యాల అగ్నిమాపక కేంద్రం సుజల పైప్స్ కర్మాగారంలో పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నంద్యాల జిల్లా స్పందన మరియు అగ్నిమాపక అధికారి ఎన్.జయన్న, జిల్లా సహాయ అధికారి బి.యోగేశ్వరరెడ్డిలు వివరించారు. ఈసందర్భంగా పరిశ్రమల్లో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు, ఆయిల్ ప్రమాదాలు జరిగినప్పుడు, గ్యాస్ లీకేజీ సంభవించినప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో మరియు వాటిని ఎలా అదుపు చేసే పద్ధతులను ప్రాక్టికల్ డెమో ద్వారా చేసి అగ్నిమాపక అధికారులు జయన్న, యోగేశ్వరరెడ్డిలు చూపించారు. ఈకార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## తాగుబోతుల నుండి పట్టణ ప్రజలను కాపాడండి

**నంద్యాల హాస్పటల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణ ప్రజలను తాగుబోతుల నుండి కాపాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ మద్యపాన నిషేదాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చడంతో తక్కువ ధరకే మద్యం దొరకడంతో తాగి రోడ్లపై వెలుతున్న ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పట్టణంలోని దేవనగర్, చర్చి సెంటర్ వద్ద ఇద్దరు తాగుబోతులు ఆటోడ్రైవర్‌ను కొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడని తెలిపారు. అలాగే ఆదివారం రాత్రి శ్రీనివాససెంటర్‌లోని లాడ్జి యజమానిని, సిబ్బందిని తాగుబోతు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడని అడ్డుకోబోయిన ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడని అన్నారు. పోలీసులకు సమాచారం తెలిపితే హుటాహుటిన వచ్చి తాగుబోతును తీసుకెళ్లి గంటకే విడిచి పెట్టడంతో తనను పట్టించిన ప్రజలను నానా బూతులు తిడుతూ దుర్భాలాషడానని అన్నారు. ఇలాంటి సంఘటనలో పట్టణంలో అనేకం జరుగుతున్నాయని వెంటనే పోలీసు యంత్రాంగ ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈసమావేశంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి జి.సోమన్న, వ్యకాస జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.సురేష్, మాబాషాలు పాల్గొన్నారు.

## గిరిజనులకు ఇబ్బంది కలిగించే జీఓ 52ను రద్దు చేయాలి

**నంద్యాల టెక్కె, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** గిరిజనులకు ఇబ్బంది కలిగించే జీఓ నంబరు 52ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని ఆలిండియా బంజార సేవా సంఘం(ఏబీఎస్ఎస్) నాయకులు డిమాండ్ చేశారు. జీఓ 52ను వ్యతిరేకిస్తూ ఏబీఎస్ఎస్ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో నంద్యాలలో తండాలోని ప్రజలతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఏబీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు బాలానాయక్, ఉపాధ్యక్షులు దుమావత్ స్వామి నాయక్‌లు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే గిరిజనులు అభివృద్ధి బాటలో పయనిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జీఓ 52ను తీసుకు రావడం దారుణమన్నారు. బోయ, వాల్మీకి, బెంతు, ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇలాంటి సమయాల్లోనే గిరిజనులంతా ఏకతాటిపై నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా అన్ని విధాలుగా అభివృద్ధిలో ఇతర కులస్తులను ఎస్టీ జాబితాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబునాయుడు చేసిన పొరపాటునే జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఇప్పటికైనా జీఓ 52ను తక్షణం రద్దు చేయాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో గిరిజనులతో ఉద్యమిస్తామని పేర్కొన్నారు.



## ప్రజల రక్షణకే పోలీసులు

**ఉయ్యలవాడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ప్రజల రక్షణ కొరకే పోలీసులు ఉన్నారని దీనికి ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గోల్డన్ ఫంక్షన్‌హాల్‌లో మండల నాయకులు ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టాల్లో రాజకీయప్రమేయాలు ఉండడం దురదృష్టకరమన్నారు. గ్రామాల్లో తలెత్తె సమస్యలు గ్రామపెద్దలే పరిష్కరించుకోవడానికి ప్రయత న్ం చేయాలన్నారు. కక్షలు, అసూయలు, ఫ్యాక్షన్లు వీడి అభివృద్ధి వైపు నడవాలన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరు రాజకీయాలకు అతీతంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు, గ్రామాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్సీలను కించపరిచారంటూ అసత్యప్రచారాలు తగదు

**కర్నూలు న్యూసిటి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్సీలను కించపరుస్తు మాట్లాడారంటూ అసత్య ప్రచారాలు చేస్తున్న సాక్షి పత్రిక, సాక్షి ఛానల్ యాజమాన్యం, వైసీపీ సోషల్‌మీడియా విభాగం తప్పుడు ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులు దళితులకు క్షమాపణ చెప్పాలి అంటూ కర్నూలు జిల్లా టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు ధరూర్ జేమ్స్ అధ్వర్యంలో ఇతర విభాగాలను కలుపకొని నియోజకవర్గంలోని బుధవారపేటలోని డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పోతురాజు రవికుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు సయ్యద్ అబ్బాస్, రాష్ట్ర క్రిష్టియన్ సెల్ నాయకులు ఆదాము, టిడిపి దళిత నాయకులు లక్ష్మీపురం, మారెన్న, టిడిపి మహిళా విభాగం నాయకులు చంద్రకళాబాయి, సునీత, విజయలక్ష్మీ,15వ వార్డు ఇంచార్జీ పామన్న, టిడిపి సీనియర్ నాయకులు దరూరు బజారన్న, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు పేరుపోగు రాజు, ఎస్సీసెల్ సోషల్‌మీడియా కో-ఆర్డినేటర్ మీసాల మనోహర్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు వై నరసింహులు, ఎం రామకృష్ణ, బాబు తదితరులు ఈనిరసన కార్యక్రమంలో పాల్గొనా న్రు.

## బ్రెయిన్ స్టోక్‌తో మృతిచెందిన బాధిత కుంటుబానికి ఆర్థికసాయం

**కల్లూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** 29వ వార్డు శారదా నగర్ 73వ సచివాలయం పరిధిలో రుక్మీణినగర్‌లో నివాసం ఉంటున్న పింజరి కాసిం ఆదివారం బ్రెయిన్‌స్టోక్‌తో చనిపోయారు. బాధిత కుటుంబ సభ్యులకు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి సోమవారం మృతుడు పింజరి కాసిం వైయస్ఆర్ భీమా ఉండడంతో నామిని పింజరి మబీ వైయస్ఆర్ భీమా తరుపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థికసాయం చేయడం జరిగింది. ఈస ందర్భంగా కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్ఆర్ భీమా ఎంతో ఉపయోగకరమన్నారు. బాధిత కుటుంబానికి పరిహార సొమ్ము ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ ్బంది, వైసీపీ నాయకులు తిరుమలేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**మంత్రాలయం, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయం పట్టణానికి చెందిన ఆకుల గురురాజు అనేవ్యక్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతునికి వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా రూ.లక్ష మంజూరయ్యాయి. ఇందులో భాగంగా తక్షణ ఆర్థిక సహాయం కింద బాధిత కుటుంబ సభ్యులు అయిన భార్య ఆకుల సరోజమ్మకు రూ.10,000 నగదును మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ భీమయ్య సోమవారం అందజేశారు. ఎంఎల్ఏవై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ నగదును అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. మిగిలిన నగదును బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరివెంట వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రకాష్, వాలంటీర్ రామాంజి తదితరులు ఉన్నారు.

## దేశం గర్వపడేలా సిఎం జగనన్న పాలన

**తుగ్గలి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశం గర్వపడేలా పరిపాలన సాగిస్తున్నారని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి, గుంత రఘులు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో వారు జగనన్న నీవే మా నమ్మకం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను అతికించి జగనన్న చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలతో ప్రతి పేదవాడి ఇంటిలో వెలుగులు విరజిమ్ముతున్నాయని ప్రతిక్షణం ప్రజల కోసం ఆలోచించే సిఎం జగన్ అని జగన్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు ఆంజనేయులు, వాలంటీర్, మనోహర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా

**తుగ్గలి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జొన్నగిరిలో దేశాయి తాండలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరిగిందని వైఎస్ ఎంపిపి ఎర్రనాగప్ప, మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, గుంత రఘు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సోమశేఖర్‌రెడ్డిలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా దేశాయి తాండలో తాగునీటి సమస్య వెంటాడుతోందన్నారు. తాగునీటి సమస్యను ఎమ్మెల్యే శ్రీదేవమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే దేశాయి తాండ కాలనీవాసులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సమస్యకు పరిష్కార మార్గం చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హనుమంతు, పంచాయతీ సెక్రటరీ నారాయణస్వామి, వైసిపి నాయకులు పక్కీరప్ప, తేరప్ప తదితరులు పాల్గొన్నారు.



## అతిథి అధ్యాపకుల నియామకాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**పత్తికొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల నియామకాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మాధురి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామర్స్-1, పొలిటికల్ సైన్స్-1, ఆర్గానిక్ పార్మింగ్-1, అక్వాకల్చర్-1, కంప్యూటర్ అప్లికేషన్-1 మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్-1 పోస్టు భర్తీల కొరకు అర్హులైన విద్యావంతులు తమ యొక్క విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికేట్స్‌ను జతపరచి పూర్తి వివరాల చిరునామాతో కూడిన దరఖాస్తును ఈ నెల 30వ తేదీలోపు కళాశాల కార్యాలయంలో ఇవ్వాలన్నారు. తదుపరి అధ్యాపకుల నియామకం గురించి మీకు ఫోన్ ద్వారా, ఉత్తరం ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు.

## కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా

**పత్తికొండ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక చదువుల రామయ్య భవన్ నుండి ప్రదర్శనగా బయలుదేరి స్థానిక నాలుగుస్థంబాల కూడలి నందు ధర్నా నిర్వహించి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి తాలుక అధ్యక్షుడు జి నెట్టికంటయ్య అధ్యక్షత వహించారు. ధర్నానుద్దేశించి ఏఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్ కృష్ణయ్య, ఏఐటియుసి ఎం రంగన్నలు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ అనేది తెలుగు వారి భావోద్వేగాలతో ముడిపడిన 32మంది ప్రాణ త్యాగాలతో ప్రాంతాలకతీతంగా సాగిన ఉద్యమాల ఫలితంగా సద్దించినదే విశాఖ ఉక్కు అన్నారు. ఉక్కు పరిశ్రమ ఇంత ఘన నేపథ్యం ఉన్న స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వ ఉక్కు సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులాస్తే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఇప్పుడు చేయదలచుకోలేదని తెలపడం జరిగిందని అయితే ఉక్కు సహాయం మంత్రి చెప్పిన మాటలు పట్టించుకోని నరేంద్ర మోడీ ప్రభుత్వం టెండర్లకు పిలవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు, స్వతంత్ర్య ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి తీవ్రమైన ఉద్యమ పోరాటాల ఫలితంగా సాధించుకున్నటువంటి పరిశ్రమ ఉక్కు పరిశ్రమ అన్నారు. మోడీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై రానున్న రోజుల్లో కార్మిక వర్గం ఉధృత పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పత్తికొండ మండల కార్యదర్శి డి రాజాసాహెబ్, ఏఐటియుసి తాలుక గౌరవ అధ్యక్షులు బి మాదన్న, తాలుక డిప్యూటీ కార్యదర్శి జి భాష, తాలుక ఉపాధ్యక్షులు ఎం రాజప్ప, రామచంద్ర, హమాలీ సంఘం నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, నాగేంద్ర, ఏఐవైఎఫ్ తాలుక నాయకులు రవి, నలకదొడ్డి శాఖ కార్యదర్శి భక్షాలు ఈరన్న, ఆటో యూనియన్ నాయకులు రవి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ హీమోఫిలియా దినోత్సవం

**బనగానపల్లెరూరల్, ఏప్రిల్17, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఐ.స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో ప్రపంచ హీమోఫిలియా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ హీమోఫిలియా మరియు ఇతర వంశపారంపర్య రక్తస్రావం రుగ్మతల గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 17వ తేదిన ప్రపంచ హీమోఫిలియా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా హీమోఫిలియా అనువంశిక వ్యాధని, మానవుని ఎక్స్ క్రోమోజోమ్‌లోని జన్యువులో ఉత్పరివర్తనం వలన సంభవిస్తుందని స్త్రీల్లో కంటే పురుషుల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. హీమోఫిలియా వ్యాధితో బాధపడేవారిలో ఏదైనా గాయం అయినప్పుడు రక్తం గడ్డకట్టడానికి, రక్తస్రావం ఆపడానికి అవసరమయ్యే ప్రక్రియ సరిగా పనిచేయదన్నారు. అనంతరం రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ హీమోఫిలియాలో ప్రముఖంగా రెండు రకాల ఉన్నాయని అవి హీమోఫిలియా ఏ అత్యంత సాధారణ రకం ఇది రక్తం గడ్డకట్టే కారకం 8లోపం వల్ల, హీమోఫిలియా బి దాదాపు 20శాతం గడ్డకట్టే కారకం 9 లోపం వల్ల సంభవిస్తుందన్నారు. అదే విధంగా రసాయన శాస్త్ర అధ్యాపకులు రవికుమార్ మాట్లాడుతూ హీమోఫిలియా వ్యాధిగ్రస్తులల్లో గాయం శరీరం వెలుపలైనా, లోపలైనా రక్తస్రావం కొనసాగుతుందని వివరించారు. ఇలాంటి వారిలో శరీరం అంతర్లీనంగా కీళ్లల్లో లేదా మెదడులో రక్తస్రావం జరిగితే అది ప్రాణాంతకంగా పరిణమిస్తుందన్నారు. గణిత అధ్యాపకులు నరేంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం హీమోఫిలియాకు ఫిజికల్‌థెరపి, ఫైబ్రిన్ సీలాండ్స్, డెస్మోప్రెసిన్ మొదలైన చికిత్సా విధానాలను అనుసరిస్తున్నరన్నారు. ఈ కార్యయక్రమంలో అధ్యాపకులు ఉమామహేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, కౌసల్యాదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమంగా కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్



**కౌతాళం, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని తోవి గ్రామానికి చెందిన హుసేని, పరశురామ్‌లు అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప తాలూకా పరిధిలోని మురవాని గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై తీసుకొని వస్తుండగా వారిని పట్టుకుని, వారి వద్ద నుంచి ఒక మోటార్ సైకిల్, 10 బాక్సులు (960 టెట్రా ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యం తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

## ఈరన్నస్వామివారి రాజగోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**కౌతాళం, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణం కోసం రూ.1,00,001, శాశ్వత అన్నదానం కోసం రూ.11,110 విరాళంగా ఎమ్మిగనూరుకు చెందిన ఉప్పర విజయ్ వారి తల్లి ఉప్పర ఉలిగమ్మ జ్ఞాపకార్థంగా అందజేశారు. దాతలకు దేవస్థానం ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి, బాండు పేపర్‌ను అందించి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామివారి ఆలయ అభివృద్ధికి ముమ్ముందు కూడా అందజేస్తామన్నారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పూజన్నస్వామి దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



## సీమకు సిద్దేశ్వరము, బ్రిడ్జికం బ్యారేజే మా భవిషత్తు 24న నిరసన దీక్షలు



**కోవెలకుంట్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** రాయసీమ వాసులకు సిద్దేశ్వరము, బ్రిడ్జికం బ్యారేజే మా భవిషత్తు మా నమ్మకమని రాయలసీమ స్టిరింగు కమిటి నాయకులు కామణివేణుగోపాల్‌రెడ్డి, గడ్డం.అమరనాద్‌రెడ్డి కరింభాషలు అన్నారు. సోమవారమ స్థానిక కొండారెడ్డి గ్రందాయలంలోవిడుదల ఈ నెల 24న తలపెట్టి నిరసనదీక్షలు కరపత్రాలను విడుదలచేశారు. ఈసందర్భముగా వారు మాట్లాడుతూ ఈనెల 24న కర్నూల్లోని యస్‌టిబిసి మైదానములో ఒక రోజు జరిగే నిరసదీక్షలను సీమ వాసులందరు హాజరై విజయవంతము చేయాలపి పిలుపు నిచ్చారు. రాయలసీమ నీళ్ల నిదుల సమానవాట కోసం రాయలసీమ కర్తవ్య దీక్షను చేపట్టామని చెపా ్రరు. అదే విదముగా సిద్దేశ్వరము, సంగమేశ్వరమువద్ద కేంద్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఐకానిక్ వంతెన బదులుగా బ్రిడ్జికం బ్యారేజిని నిర్మిస్తే సీమకు భవిషత్తు ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా అప్పర్ భద్ర అపి సిద్దేశ్వరము బ్రిడ్జి కం బ్యారేజిని ఏర్పాట్లు చేస్తే నాటి రతనాల సీమను ఇతరము వారు చూడలేదు. మీరు బ్రిడ్జి కాం బ్యారేజిని నిర్మిస్తే ఈ తరకు కూడా సీమలో రతానాలు చూసే అవకాశము కల్పించిన వారవుతారని చెప్పారు. కర్ణాటకు ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మించవలన రాయలసీమకు రావల్సిన తుంగభద్ర నది నుండి రావసిన నికర జాలాలు హెచ్ఎల్‌సి, ఎల ఎల్సి మరియు కెసికెనాల్ బైరవాణివతిప్ప ప్రాజెక్టులకు నీల్లు రావుకాని రైతులకు కళ్ల వస్తాయని చెప్పారు. వెంటనే ప్రాజెక్టును నిలుపుదల చేయాలని కోరుతూ మరియు నీళ్ల నిదుల నియమాపకాల్లో సీమకు న్యాయం చేయాలని కోరారు. దీని కోసమే 24న కర్నూల్లో ఒక రోజు స్టిరింగు కమిటి చైర్మన్ బైరెడ్డి రాజశేఖరరెడ్డి అద్వర్యంలోపెద్ద ఎత్తున నిరసనదీక్ష కార్యక్రమాని ్న చేపడుతున్నామని చెప్పానరు.

## సచివాలయంలో పూర్తయ్యే సమస్యలు డివిజన్ వరకు వస్తున్నాయి

:- స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి :- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్



**ఆదోని రూరల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** గ్రామ సచివాలయం స్థాయిలో పూర్తయ్యే సమస్యలు డివిజన్ స్థాయి వరకు వస్తున్నారని స్పందన అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నందు స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు వ్యవస్థ మీద నమ్మకం కలిగించేలా అధికారులు పని చేయాలన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండ చూడాలన్నారు. స్పందన అర్జీలను ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్యం చేయకూడదన్నారు. అనంతరం మండలాల నుండి వచ్చిన భాదితులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందచేశారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన కురువ భూపాల్ సంబంధించి స.నం 31-బి1,బి నందు 0.90సెంట్ల భూమి వారసత్వంగా సంక్రమించిందని ప్రస్తుతం మా పక్కన పొలం వారు 0.18సెంట్ల భూమిని ఆక్రమణకు గురి చేశారని దయతో విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. కోసిగి మండలం కోసిగి గ్రామానికి చెందిన నరసింహులుకు సంబంధించి స.నం 123పైకి 2.60ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్ నమోదు చేయుటకొరకు అర్జీ అందచేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందుసింగ్, డిఎల్‌పిఓ నూర్జహాన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిప్యూటీ తహశీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చేతన్ ప్రియ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

## సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన బీసీ ఇందిరారెడ్డి

**బనగానపల్లెరూరల్, ఏప్రిల్17, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చవిరెడ్డి గారి సుధాకర్‌రెడ్డి(45) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున ్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి, రాష్ట్ర థ్రోబాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి గ్రామానికి చేరుకుని సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీసీ ఇందిరారెడ్డి వెంట గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

## విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

### - స్టీల్‌ప్లాంట్ కోసం పోరాటం కొనసాగిస్తాం - ఏఐటీయుసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ

**బనగానపల్లె, ఏప్రిల్17, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో ఏఐటీయుసీ రా ష్ట్ర సమితి పిలుపు మేరకు విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు మద్దతుగా సోమవారం ఏఐటీయుసీ నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శివబాలకృష్ణ ఆధ్వర్యంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా శివబాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వంద వైఖరిని ఖండిస్తామని, పార్లమెంట్‌లో ఒకమాట బయట ఒక మాట చెబుతుందని విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మదానికి ఏఐటీయుసీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఒకే ఒక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్ అని అదే విధంగా 5కోట్ల ఆంధ్ర ప్రజల ఆశాజ్యోతి అని అలాంటి స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అప్పజెప్పడం మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 32మంది యువకుల బలిదానంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంటని అది ఆంధ్రుల ఆత్మగౌరవమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక విధానాల పై ఏఐటీయుసీ పోరాటం నిర్వహిస్తుందని మిగతా కార్మిక సంఘాలను కలుపుకుని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామన్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జీఎం సర్కిల్‌లో నిరసన చేపడుతూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ బనగానపల్లె అధ్యక్షులు కుళాయిస్వామి, ఏఐటీయుసీ నాయకులు నాగాంజనేయులు, సుబ్బయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఏ.సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఏ.శివయ్య, కె.రాముడు, సీపీఐ నాయకులు ఖాదర్ బాషా, శివనాగయ్యరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భూదాల శ్రీనివాసరావు, ఏఐటీయుసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ఏఐటీయుసీ జిల్లా నాయకులు వందనం, మల్లి, పిన్నబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**కౌతాళం, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కౌతాళంలో సోమవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామ పంచాయతీ వారి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా చలివేంద్రాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం మండలకేంద్రానికి వచ్చే వారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, ఎంపీపీ బుజ్జిస్వామి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య, వడ్డే రామన్న, ఉమాపతి, మాజీ సర్పంచ్ అవతారం, చౌదరి బసవ, సమద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు ; సర్పంచ్ శిల్పారెడ్డి, గురునాథ్‌రెడ్డి

**కౌతాళం, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** మండలంలోని బాపురం గ్రామంలో సర్పంచ్ బి.శిల్పారెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాని తెలిపారు. వైసీపీ మండల నాయకులు గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించి కూలీలకు కనీస సౌకర్యాలు పని ప్రదేశంలో కల్పించాలని, అలాగే రోజుకి రూ.270 వచ్చేలా చూడాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని పీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. గ్రామంలో నెలకొన్న వవిధ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జైపాల్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్, మహిళా పోలీస్ మమత, జూనియర్ లైన్‌మెన్ శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు అయ్యప్పరెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవరెడ్డి, వార్డుమెంబర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జగనన్న మీరే మా భవిషత్తు నినాదముతో బారీ ర్యాలీ

**కోవెలకుంట్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగన్న మీరు భవిషత్తు కార్యక్రమముపై బారీ ర్యాలీ చేపట్టారు. పట్టణ సర్పంచు మెట్ల సరళ ,ఉపసర్పంచు సూర్యనారాయణరెడ్డి నేతృత్వంలో స్థానిక గ్రామ పంచాయితీ నుండి ర్యాలీ చేపట్టారు. ఈర్యాలీ బస్టాండు మీదుగా పాండురంగస్వామి దేవాలయం, సంత మార్కెట్ స్టేట్ బ్యాంకు మీదుగా సాగింది. ఈకార్యక్రమంలో చిక్కేపల్లె ప్రసాదరెడ్డి ,నాగార్జునరెడ్డి కర్రహర్శవర్ధనరెడ్డి లాయరు మదు, కానాల

**శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానము**
శ్రీశైలం - 518101, నంద్యాల జిల్లా.

ఇ-ప్రోక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఆర్.సి.నెం. ఇ1/1377/2023. తేది: 16.04.2023

ఒక సంవత్సర కాలపరిమితితో అనగా 01/06/2023 నుండి 31/05/2024 వరకు దేవస్థానమునకు అవసరమైన వివిధ రకముల ల్యామినేషన్ పోటోలు తయారుచేసి సరఫరా చేయుటకు ఇ టెండర్లు కోరబడుతున్నవి. సంబంధిత టెండరు షెడ్యూళ్ళను తేది : 18.04.2023 నుండి 27.04.2023 వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్లు సమర్పించుటకు చివరి తేది 28.04.2023 ఇతర వివరములను వెబ్ సైట్ : www.apeprocurement.gov.in నందు సందర్శించగలరు.

యస్.లవన్న
డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

**KURNOOL MUNICIPAL CORPORATION**
e-Procurement Notice
Tender Notice No. 3-1 to 3-24/General Funds/EE&SE/Knl/23-24, dt.11.04.2023

| | |
|---|---|
| Name of the Scheme | General Funds |
| No of the work | 24 |
| Bid document download starting date | 19/04/2023 at 5:30 P.M |
| Bid document download end date | 08/05/2023 at 4:00 P.M |
| Last Date & Time for receipt of Bids | 08/05/2023 at 4:00 P.M |
| Commercial Bid Opening Date | 08/05/2023 at 4:00 P.M |

Further details can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 8008403996.

Sd/-A.Bhargav Teja, I.A.S.,
Commissioner,
Kurnool Municipal Corporation, Kurnool

# టిడిపి అధికారంలో పత్తికొండను ఏమి అభివృద్ధి చేశారు

**:- వైఎస్సార్ హయాంలోనే హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తి**

**:- మహిళా ఎమ్మెల్యేలను నారా లోకేష్ అగౌరపరిచేలా మాట్లాడడం సరికాదు.. :- బహిరంగ సభలో స్క్రిఫ్ట్ చదవడమే నారా లోకేష్ పని..అంటూ ఎద్దేవా.. :- పాదయాత్రలో నారా లోకేష్ ప్రసంగించిన తీరుపై వైసిపి నాయకులు మండిపాటు**

**తుగ్గలి,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** పత్తికొండ నియోజకవర్గంలో టిడిపి 25ఏళ్ల పాలనలో అధికారం చెలాయించిన టిడిపి నాయకులు ఏమి అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా..?అంటూ నారా లోకేష్‌పై వైసిపి సీనియర్ నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి,మండల కన్వీనర్ జిట్టా నాగేష్,జడ్‌పిటిసి పులికొండ నాయక్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎర్రగుడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ అడ్డదారులలో పదవులు సంపాదించిన నారా లోకేష్ ఎవరో పేపర్‌లో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వినిపించడం చాలా దారుణం అన్నారు. నారా చంద్రబాబునాయుడు, కెఈ కృష్ణమూర్తి ఎన్నికల ప్రచార సభలో ఎన్నోసార్లు పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పారని వారు ఎందుకు ఏర్పాటు చేయలేదని లోకేష్‌ను ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే హంద్రీనీవా ప్రాజెక్టు పూర్తయితే చంద్రబాబునాయుడు హయాంలో కనీసం చెరువులకు నీళ్లు మళ్లించే పనులు కూడా ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. 70శాతం పనులు టిడిపి ప్రభుత్వం చేసినట్టు నారా లోకేష్ బహిరంగ సభలో మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పైప్‌లైన్ నిర్మాణ పనులు 70శాతం పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. ఇందులో భూములు కోల్పోయిన రైతులకు వైకాపా ప్రభుత్వంలోనే నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేలు శ్రీదేవమ్మ రోజులను కించపరిచే విధంగా నారా లోకేష్ మాట్లాడడం సమాజంలోనే మహిళలందరినీ అగౌరవ పరిచినట్లేనని వారు అన్నారు. లోకేష్ తల్లిని ఎవరు ఏమి అనకపోయినప్పటికీ చంద్రబాబునాయుడు ఏడవడం జరిగిందన్నారు. ప్రజలందరికి సమస్యలు లేకపోవడంతో పాదయాత్రలో టిడిపి నాయకులే తమ కార్యకర్తల చేత పెయిడ్ ఆర్టిస్టులైన టిడిపి కార్యకర్తలచేతే నారా లోకేష్‌కు వారే రాసి అర్జీలను ఇవ్వడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు రైతులకు రుణమాఫీ చేస్తానని,పొదుపు రుణాలు మాఫీ చేస్తానని,ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చారా అని ప్రశ్నించారు. తమ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చడం జరిగిందన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో జరిగిన పనులకు కూడా రూ.2వేల కోట్లు వైసిపి ప్రభుత్వం చెల్లించడం జరిగిందన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో జనాలు లేక వెలవెల బోతుండడంతో ఎలాగైనా వైసిపి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నారా లోకేష్ ఒక జోకర్‌గా బహిరంగ సభలో మాట్లాడుతుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారని ఎద్దేవ చేశారు. వార్డుమెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేష్ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదన్నారు. నారా లోకేష్ ఇలాంటి పాదయాత్రలు ఎన్ని చేసినా అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. 2024అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని వారన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం ; ప్రదీప్‌రెడ్డి

**కౌతాళం, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్సీపీ యువ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నరు. ఈ మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కుంటనహాల్ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అవినీతిరహిత పాలన గురించి ప్రజలకు తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, జెడ్పీటీసీ రాధప్రియదర్శిని, ఎంపీపీ అంబ్రేష్, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ దేశాయ్‌ప్రహ్లాద్ ఆచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, బంగారం, శివరామ్, సర్పంచ్ పాల్ దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, సమద్, గ్రామంలోని పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లిన యువకుడు మృతి





**ఆదోనిటౌన్, ఏప్రిల్17, ప్రభాతవార్త ;** సరదాగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు మృత్యువాత పడిన ఘటన స్థానిక బోయనగర్‌లో ఉన్న చౌదరిబావిలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బంధువులు వన్‌టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమాన్‌నగర్‌లోని ఎరుకల కాలనీకి చెందిన భీమన్న కుమారుడు ఎరుకల నాగరాజు(18) స్నేహితులతో కలిసి సరదాగా బోయనగర్‌లో ఉన్న చౌదరిబావికి ఈతకు వెళ్లాడు. స్నేహితులతో సరదాగా ఈత కొడుతుండగా నాగరాజుకు ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. స్నేహితులు వెతికినా దొరకకపోవడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు బావిలో మృతదేహాన్ని వెతికారు. రెండు మూడు గంటల పాటు వెతకగా.. రాత్రి 7 గంటల సమయంలో నాగరాజు మృతదేహం దొరికింది. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎరుకల నాగరాజు ఇంటర్మీడియెట్ ఫెయిల్ కావడంతో తండ్రి వెంట బ్యాండ్ వాయించడానికి వెళ్తున్నట్లు తెలిపారు. భీమన్నకు నాగరాజు మూడో కుమారుడు. అగ్నిమాపక సిబ్బంది, వన్‌టౌన్ పోలీసులు బంధువుల కోరిక మేరకు మృతదేహాన్ని అప్పగించారు. వెతికిన వారిలో అగ్నిమాపక అధికారి యేసురత్నం, సిబ్బంది ఉన్నారు.

## కానాల గ్రామంలో ఉద్రిక్తత - మహిళ రైతులు పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యయత్నం

**-అధికారులను నిలదీసిన మహిళా రైతులు**



**నంద్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఉన్న పొలం సాగుచేసుకుంటూ జీవనోపాధి చేసుకుంటున్న రైతుల పాలిట నంద్యాల, జమ్ములమడుగు 167 కె జాతీయ రహదారి వారి జీవితాల్లో చీకటి మయం చేయడానికి అధికారులు, రాజకీయనాయకులు కంకణం కట్టుకున్నారని మహిళా రైతులు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సోమవారం జాతీయ రహదారి సర్వే నిమిత్తం నంద్యాల తహశీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్లు జాతీయరహదారి అధికారులు వెల్లడంతో ఆ గ్రామంలో ఉన్న రైతులందరు ఒక్కసారిగా పొలాల్లోకి వచ్చి పురుగుల మందు డబ్బాలతో ఆత్మహత్యయత్నం చేసుకుంటామని బెదిరించారు. కొంతమంది రాజకీయ నాయకులుస్వార్థంతో జాతీయ రహదారిని తమ పొలాల పక్కన పోవడానికి అలైన్‌మెంటు మార్చారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై గత వారం రోజుల క్రితం నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సామూన్‌ను కలిసి ఆ ప్రాంత రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని వినతిపత్రం ఇచా ్చరు. రైతునగరం, కానాల గ్రామాలను అలైన్‌మెంటును అధికారులు మార్చడంతో ఆ ప్రాంత రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కూడ వెనుకాడమని ఈ రహదారిని మార్చాలని కోరారు. నంద్యాల తహశీల్దార్ శ్రీనివాసులు అధికారులు ఇచ్చిన రూట్‌మ్యాప్ మేరకే మేం సర్వేకోసం వచ్చామని ఇందులో కానాల రైతులు అడ్డగిస్తున్నారని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపుతామన్నారు. సన్నకారు రైతులు నష్టపోతున్నప్పటికి భూస్వాముల పొలాలు పోకుండా, రాజకీయ నాయకులు పొలాలు పోకుండా సర్వేచేస్తున్నారని వారు ఆరోపించారు. మేం పేదవాళ్ల్ం, పేద రైతు రైతులం మీకు న్యాయం చేస్తామంటేనే జగనన్నకు ఓటు వేశామని ఈపొద్దు మా పొలాలు పోతుంటే కనీసం ఎమ్మెల్యే కూడ పట్టించుకోవడం లేదని మహిళా రైతులు ఆరోపించారు. సమస్య పరిష్కారం కాకపోతే పంటపొలాల్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యచేసుకుంటామని మహిళలు, రైతులు పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే

**వెల్దుర్తి ఏప్రిల్17(ప్రభాతవార్త):** కర్నూలు జిల్లా కలెక్టరుగా డాక్టరు సృజన, జాయింట్ కలెక్టరుగా నారపురెడ్డి మౌర్య బాధ్యతలను స్వీకరించారు. కలెక్టరు కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టరు డాక్టరు సృజనను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జాయింట్ కలెక్టరు నారపురెడ్డి మౌర్యను కూడ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మర్యాద పూర్వకంగా కలిసి పత్తికొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. అనంతరం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన ఎస్పీ కృష్ణకాంతన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**నంద్యాలవాసి గాజుల సురేఖకు డాక్టరేట్... అభినందనలు తెలిపిన**

## ఆర్జీఎం కళాశాల ఛైర్మెన్ శాంతిరాముడు



**నంద్యాల విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నంద్యాల వాసి గాజుల సురేఖకు భౌతిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ లభించడం పట్ల ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మెన్ మిద్దె శాంతిరాముడు అభినందనలు తెలిపారు. పాణ్యం మండలం నెరవాడ సమీపంలో ఉన్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగంలో పని చేస్తున్న గాజుల సురేఖకు అనంతపురం జేఎన్‌టీయూ వారు 17వ తేది సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. బ్యాటరీల శక్తి సామర్థ్యం పెంచుటకు సంబంధించి ప్రొఫెసర్ ఎన్ రవి పరిరక్షణలో ఫ్యాబ్రికేషన్ క్యారెక్టరైసేషన్ మరియు పర్‌ఫెర్మాన్స్ అనాలసిస్ ఆఫ్ రెడ్యూసుడ్ గ్రాఫిన్ ఆక్సైడ్ నానో కాంపోజిట్ అనోడ్ బేస్‌డ్ లిథియం అయాన్ బ్యాటరీస్ మీద చేసిన పరిశోధనకు గాను గాజుల సురేఖకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం వారు భౌతిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందజేశారు. డాక్టరేట్ అందుకున్న సురేఖను కళాశాల ఛైర్మెన్ శాంతిరాముడుతో పాటు డైరెక్టర్ అశోక్, ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

## నంద్యాల ఎమ్మెల్యేగా భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పోటీలో ఉంటారు



**నంద్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** నంద్యాల నడిబొడ్డున ఉన్న రామకృష్ణ విద్యాలయ సంస్థకు చెందిన 40సెంట్ల స్థలంపై గత కొన్నిరోజులుగా రచ్చ రచ్చ రభసా రభసా జరుగుతుంది. వైసీపీ వర్సెస్ టిడిపి అన్న కోణంలో ఈ అంశంపై రోజుకోకరు విలేఖరుల సమావేశాన్నిఏర్పాటు చేసుకుంటూ ఒకరిపై ఒకరు అరోపణలు,ప్రత్యారోపణలు చేసుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం నాడు టిడిపి యువ నాయకుడు జగత్‌విఖ్యాత్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది, లీగల్‌సెల్ మాజీ అధ్యక్షులు తాతిరెడ్డి తులసిరెడ్డి, మాజీ కౌన్సిలరు చింతల సుబ్బరాయుడులు విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎమ్మెల్యే శిల్పాపై సండే ఎమ్మెల్యే అక్రమాలకు, ల్యాండ్ మాఫియాలకు కొదువలేదంటూ నంద్యాల్లో రియల్ ఏస్టేట్ దందా నడుస్తుందని ఆరోపించారు. దీనికి ఆదివారం నాడు మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంషావలి, గంగిశెట్టి శ్రీదర్‌లు పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి భూ కబ్జాలు చేయడం ఎమ్మెల్యే నైజం కాదని ఏవరిస్థాయి ఏమిటో తెలుసుకొని మాట్లాడాలని హితువు పలికారు. శిల్పా సేవా సమితి స్థలాన్ని కబ్జాచేస్తున్నారని తప్పుడు వదంతులు చుస్తుంటే దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందని విమరి ్శంచారు. దీనిపై జగత్ విఖ్యాత్‌రెడ్డి కారా ్యలయంలో టిడిపి మాజీ కౌన్సిలర్ కృపాకర్, ఒంటివెలగల శీలం భాస్కర్‌రెడ్డి, జార్జీ, రైతునగరం ప్రభాకర్‌రెడ్డిలు సోమవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒకరిస్థాయి ఏమిటో చెపె ్పముందు తమస్థాయి ఏమిటో తెలుసుకోవాలని అరోపించారు. ఒకరిని ఒకరు మాటల యుద్ధంలో నంద్యాల పట్టణం వేడి పుట్టిస్తుంది. స్థలం వివాదస్పదంగా ఉన్నప్పుడు అక ్కడే కట్టడం ఎందుకు పట్టణంలో పలుచోట్ల రోడ్లు, డ్రైనేజి, వంతెనలు, అస్తవ్యస్తంగా ఉన్నాయి గదా అక్కడ అభివృద్ధి ఎందుకు చేయడం లేదంటూ ప్రశ్నించారు. దివంగత నేతలు మాజీ ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డిలు నంద ఆయల పట్టణాన్ని ఎంత అభివృద్ధి చేశారో నంద్యాల ప్రజలకు తెలుసు అన్నారు. రాబోయే ఎన్నికల్లో భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి నంద్యాల ఎమ్మెల్యేగా పోటీచేస్తారని వారు పేర్కొన్నారు. మీ స్థాయి ఏమిటో మీరు తెలుసుకోవాలని వారు పేర్కొన్నారు.

## శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో ఉడిపి పీఠాధిపతి



**మంత్రాలయం,అక్టోబర్ 20,ప్రభాతవార్త:**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై ఉడిపి అధమారు మఠం పీఠాధిపతి శ్రీ విశ్వప్రియతీర్థులు సోమవారం మంత్రాలయం విచ్చేశారు.వీరికి శ్రీమఠం అధికారులు,విద్యార్థులు,పండితుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు.అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.శ్రీ రాఘవేంద్రస్వామి బృందావనానికి మంగళ హారతులిచ్చారు.శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు.రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి రాజా ఎస్ గిరియాచార్ ఆధ్వర్యంలో చర్చాఘోష్టి నిర్వహించారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ రాజా ఎస్ గిరియాచార్ శ్రీ రాఘవేంద్రస్వామి మొమెంటో,ఫల,పుష్ప,మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. వీరివెంట శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు,వెంకటేష్ జోషి,జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారి,అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసి ంహామూర్తి తదితరులు ఉన్నారు.



## సి.యం.సార్ మాకు న్యాయం చేయండి 98 డిఎస్సీ క్వాలిఫైడ్స్



**నందికొట్కూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** సి.యం.సార్ మీరు పాదయాత్రలో మేము అధికారం చేపట్టగానే 6754 మంది 98 క్వాలిఫైడ్ డిఎస్సీ అభ్యర్థులందరికి ఉద్యోగవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని కాని 4072 మందికి ఇచ్చి ఇంకా 2682 మందికి పెండింగ్ పెట్టారని మిగిలిన వారికి వెంటనే అవకాశం కల్పించాలని కోరుతు ఏమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసిన 98 క్వాలిఫైడ్ డిఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనంతపూరు, చిత్తూరు జిల్లాలో అందరికి ఇచ్చారని కాని ప్రకాశం జిల్లాలో 561,గుంటూరులో 559, వై.ఎస్.ఆర్.కడపలో 408,కర్నూలు 335, ఈస్ట్ గోదావరి 206,వెస్ట్ గోదావరి 112, క్రిష్ణా 262, నెల్లూరు 201, విజయనగరం 38కి రాలేదన్నారు. 98 డిఎస్సీ క్వాలిఫైడ్ వారికి ఉద్యోగాలు ఇస్తున్నామని మీరు (ప్రభుత్వం) ప్రకటించగానే మేము పని చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం మమ్ములను తొలగించారని దీంతో మా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, మీరు వెంటనే మిగిలిన వారందరికి జీవనోపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి మాకు న్యాయం జరిగేలా చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీంతో స్పంధిస్తు వెంటనే ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు మాకు సంతృప్తినిస్తున్నాయి ఎమ్మెల్యేతో లబ్ధిదారుల



**నందికొట్కూరు,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలు మాకు సంతృప్తినిస్తున్నాయని ఆయనే మా నమ్మకమని సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్‌కు వివరించారు. సోమవారం పట్టణంలోని 10వ సచివాలయ పరిధిలోని సంఘయ్యపేట, శికారిపేటలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి ఇంత వరకు ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాల ద్వారా వారు ఎంత లబ్ది పొందింది తెలుపుతు ఇంకా ఏమైన సమస్యలు ఉన్నాయా అంటు అడిగి తెలుసుకున్నారు. కొంత మంది తమకు పింఛన్ కావాలని, అలాగే డ్రైనేజ్, కాలువలు కావాలని కోరారు. దీంతో స్పంధించిన ఎమ్మెల్యే సంభంధిత అధికారులను వెంటనే పరిష్కారించాలని, తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని అధికారులకు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని కావున మరో సారి జగనన్నను ఆశీర్వాదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమీషనర్ పి.కిషోర్, విధ్యుత్ ఏడిఏ శ్రీనువాసులు, సింగిల్ విండో చైర్మన్ సగినేల ఉశేనయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్లరబ్బానీ, డి.ఇ.నాయబ్‌రసూల్, ఎం.ఇ.ఓ.ఫైజున్నిషాబేగం, కౌన్సిలర్ జాకీర్‌హుశ్శేన్, వివిధ శాఖల అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న రాష్ట్రమంత్రి ఉషశ్రీ చరణ్

**-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి-మంత్రిని ఆశీర్వదించిన పండితులు**



**మంత్రాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త :**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ,వికలాంగుల,వయోవృద్ధుల శాఖమంత్రి ఉషశ్రీ చరణ్ సోమవారం మంత్రాలయం విచ్చేశారు.వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికా రు.శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు.అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్నిదర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు.వీరికి శ్రీమఠం ప ండితుల ఆధ్వర్యంలో శ్రీ రాఘవేంద్రస్వామి మొమెంటో, ఫల,పుష్ప,మంత్రాక్షితలతో ఆశీర్వదించారు.వీరివెంట శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు,ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు,కిరణ్‌బాబుతదితరులు ఉన్నారు.

## రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు



**కల్లూరు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** పాణ్యం నియోజకవర్గ కల్లూరు అర్బన్ ప్రాంతం 35వ వార్డు హజరత్ మౌలాన యూసుఫ్ సహెబ్ రహంతుల్లా అలై మసీదు వద్ద ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసుతన్నట్లు పాణ్యం ఎమ్మెల్యే, టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు 35వ వార్డు హజరత్ మౌలానా యుసుఫ్ సాహెబ్ రహంతుల్లా అలై మసీదు వద్ద సోమవారం ఆయన ఏర్పాట్ల పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ముస్లిం ప్రజల ఇబ్బందులను గుర్తించిన వార్డులో వక్ఫ్‌బోర్డుకు చెందిన 3.50 ఎకరాల భూమి గుర్తించడం జరిగిందన్నారు. మసీదు నిర్మాణానికి కృషిచేస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మేనేజింగ్ కమిటీకి అభినందనలు తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు జరుపుకోవడానికి ఇప్పటికే కొత్త బస్టాండ్ వద్ద సంతోష్ నగర్ వద్ద, రెండు ఈద్గాలున్నాయన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా 35వ వార్డు మసీదు వద్ద ప్రార్థనలు జరుపుకోవాలని ఆయన తెలిపారు. కమిటీ కార్యదర్శి ముల్లా హుసేన్ సాహెబ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కృషివల్ల వక్ఫ్‌బోర్డు భూములు గుర్తించి మసీదు ఏర్పాటుకు అహర్నిశలు కృషిచేశారన్నారు. మసీదు నిర్మాణానికి రూ.20 కోట్ల బడ్జెట్‌తో ప్రణాళిక చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం పెద్దపాడు యూసుఫ్ మియా రూ.40 లక్షలు, నగరానికి చెందిన జామియా మసీదు పెద్దలు రూ.10 లక్షలు ఇతర దాతల ద్వారా రూ.20 లక్షలు సహకారంతో పిల్లర్లు నిరి ంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ సాపూరి మాధురి, 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, వైసీపీ నాయకులు సాపూరి వీరయ్య, సందెపోగు శివ, విద్యాకమిటీ చైర్మన్ సిరాజ్, మసీదు కమిటీ అధ్యక్షులు ఖసింమియా, కోశాధికారి ఖాజామియా, ఉపాధ్యక్షులు మహబూబ్ బాష, కార్యదర్శి మౌలాన, జుబేర్, అహమ్మద్ ఖాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన ఆశోకా ఈ క్యూబ్ కార్నివాల్-2023




**కర్నూలు విద్య, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** స్థానిక దూపాడు 'ఆశోకా' ఉమెన్స్ ఇంజరింగ్ కళాశాల వారు ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ క్యూబ్ ఉమెన్స్ కార్నివాల్‌ను సోమవారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ప్రారంభించారు. ఈసందర ్భంగా ప్రారంబోత్సవానికి ముఖ్య అతిథిగా ఏపీ స్టేట్ ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు శారదా కసిరెడ్డి హాజరై రంగురంగుల బెలున్స్ గాల్లోకి వదిలారు. వారం రోజుల పాటు కొనసాగే సంబరాల ఈ క్యూబ్ ఉమెన్స్ కార్నివాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆశోకా విద్యార్థినిలు గత ఏడాది 2022లో 523 ప్లేస్‌మెంట్స్ మరియు ఈఏడాది ఇప్పటివరకు సుమారు 627 ప్లేస్‌మెంట్స్ సాధించినందుకు కర్నూలు జిల్లాకే గర్వకారణమని మహిళా సాధికారత పట్ల ఆశోకా కళాశాల మెనేజ్‌మెంటు వారి కృషికి నిదర్శనమన్నారు. ఈకార్యక్రమంలో ఆశోకా కళాశాల డైరెక్టరు డా.హరిస్ కృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీమఠం నిర్మాణ పనులను పరిశీలించిన పీఠాధిపతి



**మంత్రాలయం,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో నూతన ంగా నిర్మిస్తున్న శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్మాణ పనులను మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు సోమవారం పరిశీలించారు. త్వరితగతిన శ్రీమఠం నిర్మాణ పనులను పూర్తి చేస్తున్నట్లు,త్వరలోనే భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని పీఠాధిపతి తెలిపారు.అనంతరం పవిత్ర గంగానదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గంగాపూజ చేసి భక్తులను ఆశీర్వదించారు.వివిధ రకాల అభివృద్ధి పనులను పరిశీలించారు.

## నిరుపేద ముస్లీం మహిళలకు చీరెలు, రంజాన్ తోఫా పంపిణి



**నంద్యాల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** రంజాన్ పండుగను పురష్కరించుకొని నిరుపేద మహిళలకు చీరెలు, రంజాన్ తోఫా ఈద్గా కిట్లను సంఘ సేవకుడు తాటికొండ బుగ్గరాముడు, దేరెడ్డి శివనాగిరెడ్డిలు పంపిణి చేశారు. సోమవారం రంజాన్ పండుగ పర్వదినాన్ని పురష్కరించుకొని తనకున్నదాంట్లో కొద్దిమంది పేదలకు సేవ చేయాలనే తలంపుతో వారికి ఆర్థికంగాను రంజాన్‌తోఫా కిట్ల ద్వారా అదుకోవడం దైవం ఇచ్చిన కానుకగా పేర్కొన్నారు. వైయస్‌ఆర్ నగర్‌లోని ముస్లీం మహిళలకు 300 మందికి చీరెలు, మరియు రంజాన్‌తోఫా కిట్లను పంపిణి చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. పేదరికం కారణంగా అనేక కుటుంబాలు అశించిన విధంగా పండుగలను జరుపుకోలేక పోతున్నారని అలాంటి నిరుపేదలకు తమకు చేతనైనంత వరకు సహాయం చేసి అదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ మహిళలకు చీరెలు, రంజాన్ తోఫా కిట్లు పంపిణి చేశారు. అందరికి పంపిణి చేయలేకపోయినా కొంతవరకైనా పేదలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకుంటారని ఆశించామన్నారు. భవిష్యత్తులో ప్రజల దీవెనలు, ఆశీస్సులు ఉంటే మరిన్ని బృహత్తరమైన సేవా కార్యక్రమాలు ద్వారా అందరికి సేవ చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళలు, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.